# రక్తచైతన్యం

''పెళ్లికొడుకు కనిపించడం లేదట. పెళ్లికూతురు దగ్గరకొచ్చి గుసగుసగా అంది అరుణ.

'అలాగా' అన్నట్టు చూసింది పెళ్లికూతురు శైలజ.

''నువ్వంటే ఇష్టం లేదట కదనే... అందుకే అతడు ఎక్కడికో పారిపోయాడట'' శైలజ చెవిదగ్గర ముఖం పెట్టి అంది అరుణ.

''ఇష్టంలేదా? ఆ సంగతి యిప్పుడు.... పెళ్ళయిపోయాక... ఇప్పుడంటున్నాడా? అతనికేమయినా బుద్ధుందా?'' కోపంగా అంది శైలజ మరో ఫ్రెండ్ నీరజ.

''పెద్దగా మాట్లాడకే... వాళ్ళెవరైనా వింటే గొడవైపోతుంది'' అంది అరుణ.

''విననీ... నాకేమన్నా భయంవా? లేకపోతే శోభనంనాడు పెళ్ళికొడుకు పారిపోవటమేమిటి?'' నీరజ ఇంకా గట్టిగా అంది.

ఇంట్లో ఎవరినోట విన్నా ఇదేమాట - ''పెళ్లికొడుక్కు పెళ్లికూతురు ఇష్టం లేదు. అందుకే పారిపోయాడు'' అని...

పెళ్లికూతురు కంటనీరు పెట్టుకుంది. ఆమె తరఫు బంధువులంతా ''లక్ష రూపాయల కట్నమిచ్చి కొనుక్కున్న పెళ్లికొడుకు ఇంత అవమానం చేస్తాడా?'' అని గుండెలు బాదుకున్నారు. కోపంతో మండిపోతున్నారు.

వయస్సుకు మించిన ఒడ్డూ పొడుగూ ఉండి, ముఖంమీద ఏమాత్రం కళలేని పెళ్లికూతురు శైలజ ముఖం ఆవేదనతో ఇంకా వికారంగా మారిపోయింది. స్నేహితురాండ్ర మధ్య మోకాళ్లమీద తలపెట్టుకుని ఆమె మౌనంగా రోదిస్తూ ఉండిపోయింది.

* * *

''వాడెక్కడికెళ్ళుంటాడు?'' పెద్దకొడుకు గోపీకృష్ణనడిగాడు నరసింహయ్య.

''వాడికి ఫ్రెండ్స్ చాలామందున్నారు నాన్నా! వాళ్లందరి ఇళ్ళూ వెదికితే గాని తెలియదు''

''ఇంకా చూస్తావేం? ఓ ఆటో తీసుకుని ఊరంతా వెదుకు వాడు... ఆ

రామకృష్ణగాడు... ఎక్కడున్నా తీసుకురా. మామూలుగా వాడు రాకపోతే కాళ్ళూ చేతులూ కట్టైనా తీసుకురా... వెంటనే బయలుదేరు'' చిందులు తొక్కుతూ గర్జించాడు నరసింహయ్య.

''అలాగే నాన్నా'' బయటకు పరుగెడుతూ అన్నాడు గోపీకృష్ణ.

* * *

''ఒరేయ్! నీకు బుద్ధిలేదురా'' రామకృష్ణతో అన్నాడు ప్రసాద్.

ప్రసాద్ రామకృష్ణకు ఈ మధ్యనే ఫ్రెండయ్యాడు. సిటీకి దాదాపు 20 కిలోమీటర్ల దూరంలో ఉన్న బొలారంలో ఉన్న ప్రసాద్ రూం తనకు రక్షణగా ఉంటుందని రామకృష్ణ అక్కడకు వచ్చాడు. తన పాతమిత్రులకుగానీ, అన్నయ్యకుగానీ ప్రసాద్ రూం తెలియదు.

అయినా అతి జాగ్రత్త కోసం ప్రసాద్ రూంకు బయటినుంచి తాళం వేసి వంటగదినుండి లోపలచేరి కిటికీలన్నీ మూసిపెట్టాడు రామకృష్ణ.

''నువ్వు చేసిన పని ఏం బాగాలేదురా!'' మళ్ళీ కదిలించాడు ప్రసాద్.

''గో టు హెల్...'' అన్నాడు రామకృష్ణ.

''సరే నాయనా... నేను ప్రస్తుతం అక్కడే ఉంటున్నాను. ఇంకెక్కడ కెళ్ళమంటావు? ఈ మాటను శోభనం గదిలో నీ కోసం క్షణమొక యుగంగా ఎదురుచూస్తున్న ఆ పెళ్ళికూతురుకు చెప్పు'' ప్రసాద్ అన్నాడు రామకృష్ణ.

''ఇష్టం లేకుండా ఆ అమ్మాయిని పెళ్ళెందుకు చేసుకున్నావురా? ఈ పారిపోవటం అప్పుడే చేస్తే బాగుండేది కదరా?''

''నా కర్మ... ఆ నరకంలోంచి బయటపడదామని... ఫ్రెండువుగదాని నీ దగ్గరకొస్తే నువ్వు అంతకన్నా పెద్ద నరకాన్ని సృష్టిస్తున్నావు.... ఛీ! ఛీ! మరోచోటి కెక్కడికన్నా వెళ్లిపోతాను'' విసురుగా లేస్తూ అన్నాడు రామకృష్ణ.

''అంత మిత్రద్రోహానికి నేను పాల్పడను కానీ కూర్చోరా నాయనా!'' రామకృష్ణ భుజాలమీద చేతులు వేసి కూర్చోబెట్టాడు ప్రసాద్.

ఓ రెండు నిమిషాలు నిశ్శబ్దం. ప్రసాద్ రామకృష్ణనే చూస్తూ ఉండిపోయాడు.

''ఒరేయ్ కృష్ణా! పూర్వం శ్రీరామచంద్రుడు మగవాళ్లకి ముద్దొచ్చేంత అందంగా ఉండేవాడంటే నమ్మలేకపోయేవాన్ని. కాని - నిన్ను చూస్తుంటే ఆ మాట నిజమేననిపిస్తోందిరా'' ప్రసాద్ నిశ్శబ్దాన్ని భంగం చేశాడు.

''ఏమిట్రా నీ గోల. కాసేపు కూడా నిశ్శబ్దంగా ఉండలేవా?'' రామకృష్ణ విసుక్కున్నాడు.

ప్రసాద్ అన్నమాట నిజమే. తను చాలా అందంగా ఉంటాడు.

చదువుకునే రోజుల్లో తననందరూ 'మిస్టర్ కాలేజీ' అనేవాళ్ళు. ఆడపిల్లలు తనను

అదేపనిగా చూసేవాళ్ళు. వారిలో అందరికంటే అందంగా ఉన్న అమ్మాయినిగూర్చి తను కలలు కనేవాడు. అప్సరసలా ఉన్న ఓ అమ్మాయి తనను ప్రేమిస్తుంది. తనను వెదుక్కుంటూ వస్తుంది. తను కూడా ఆమెను ప్రేమిస్తాడు. ఆ అమ్మాయిని తప్ప తను వేరేవారిని పెళ్ళి చేసుకోడు. ఆ మహత్తర క్షణం కోసం తాను ఎదురుచూస్తుండేవాడు.

కానీ ఏమయింది? తనను ఘోరంగా వంచించారు. తనకు పెళ్ళి చేశారు. పెళ్ళి చేసుకోను అని నెత్తీనోరు బాదుకున్నా వాళ్లు వినలేదు. ఎవరినైనా ఎదుర్కోగలిగే తాను నాన్నను ఎదుర్కోలేడు. నాన్నంటే భయం... ఎదురుగా కూడా వెళ్లలేడు. నాన్న చిన్ననాటినుండి తననలా తయారుచేవాడు. నాన్న.... రాక్షసుడు - కర్కోటకుడు. బండరాయికన్నా ఆర్ద్రత ఉంటుందేమో కానీ నాన్నకు దయ కరుణలాంటివి లేవు. తనినంకా పసిపిల్లాడే అనుకుంటాడు. పాతికేళ్లున్న తాను నాన్న లే అంటే లేవాలి. కూర్చోమంటే కూర్చోవాలి. తను నిర్మించుకున్న స్వప్నసౌధాలన్నింటినీ నిర్దాక్షిణ్యంగా ముక్కలచేయడం చేసిన క్రూరుడు నాన్న'' రామకృష్ణ మనసు నాన్నమీద కోపంతో మండిపోతోంది.

''ఏమిట్రా ఆలోచిస్తున్నావు? ఈ పాటికి ఆ పెళ్లికూతురు బాహువుల్లో ఉండాల్సిన వాడివి... ఈ దిక్కుమాలిన కొంపలో యెందుకున్నావనా ఆలోచిస్తున్నావు?'' ప్రసాద్ ఏకాంతాన్ని భంగం చేస్తూ వచ్చి, బ్రెడ్ పీసెస్, ఆమ్లెట్ ఉన్న ప్లేట్ అందించాడు.

''ప్రసాదూ! నేనే విషయం మరచిపోవాలని ప్రయత్నిస్తున్నానో అదే విషయాన్ని నువ్వు పదేపదే గుర్తుచేసి నా ప్రాణం తీస్తున్నావు'' బ్రెడ్ పీసెస్ అందుకుంటూ అన్నాడు రామకృష్ణ.

''అదికాదురా... ఏ పనైనా ముందే జాగ్రత్తగా ఆలోచించి చేయాలి. కాపురం చేయదలచుకోని వాడివి పెళ్ళెందుకు చేసుకున్నావు? ఇష్టంలేని పెళ్ళి చేయటానికి నువ్వేమీ చంటిపిల్లాడివి కాదుగదా!'' ప్రసాద్ శాంతంగా అడిగాడు.

''నీకింకా ఎన్నిసార్లు చెప్పాలిరా! ఈ దేశంలోని తల్లిదండ్రుల దృష్టిలో పాతికేళ్ల యువకుడు కూడా చంటిపిల్లవాడే. ముందే ఆలోచించుకుని చెయ్యడానికి మనకున్న ఫ్రీడం ఎంత? తల్లీ, తండ్రీ, బంధువులు, సాంప్రదాయం, కుటుంబ గౌరవం - ఎన్నింటికి దాస్యం చేయాలి మనం? మా నాన్న చండశాసనుడు. చిన్నప్పటినుండి ఆయనంటే నాకు చచ్చేంత భయం. వాళ్లు దగ్గరి బంధువులేకాక, మా నాన్నకు ఆ అమ్మాయి తండ్రి చిన్ననాటి స్నేహితుడు. 'మీ అమ్మాయిని మా అబ్బాయికిచ్చి పెళ్లి చేసుకుంటాను'' అని ఆ స్నేహితుడికి మాటిచ్చాడట. అంతే... చచ్చినట్టు నేను పెళ్ళి చేసుకోవాల్సిందే...'' రామకృష్ణ దీర్ఘంగా నిట్టూర్చాడు.

''అప్పటికి నేను చాలా పోట్లాడానురా! ఏనాడూ ఎదురు తిరగని నేను పెళ్లి చేసుకోను అని గట్టిగా చెప్పాను. కాని... ఈ పెళ్లి చేసుకోకపోతే అందర్నీ చంపేసి తాను చస్తానని మా నాన్న ఉరిమేటప్పటికి నోరు మూసుకోవాల్సి వచ్చింది'' అన్నాడు రామకృష్ణ.

''మరి అప్పుడే ఈ విధంగా పారిపోక పోయావా?'' ప్రసాద్ అడిగాడు.

''ఆ ప్రయత్నమూ చేశాను. కానీ మా అన్నయ్య కాపలా ఉన్నాడు. పెళ్ళయ్యేదాకా వాడు నన్నొక్కక్షణం కూడా వదిలి పెట్టలేదు''

''కనీసం అమ్మాయిని చూపించారా నీకు?''

''చూపించడమా? నా ఇష్టాఇష్టాలతో ప్రమేయంలేని వారు నాకెందుకు చూపిస్తారు?'' ఆ అమ్మాయి నాకు నచ్చింది. ఆ కుటుంబం నాకు నచ్చింది. నువ్వు పెళ్ళి చేసుకోవాలి'' అదే గదా మా నాన్న అభిప్రాయం.

''అయితే చూడలేదన్నమాట''

''చూశాను. పెళ్లి పందిరిలో చూశాను''

''ఎలా ఉంటుంది?''

''పరమ అసహ్యంగా ఉంటుంది. నాతో రెండింతలు లావు. నాకన్నా పదేళ్లు పెద్దదానిలా ఉంటుంది. కళ్ళు లోతు - కలర్ నలుపు - ఓహ్! నేను ఆ వికార రూపాన్ని వర్ణించలేనురా'' రామకృష్ణ తల పట్టుకున్నాడు.

''సరే... ఒక్క విషయం ఆలోచించు... ఎవరో చేసిన తప్పుకు ఆ అమ్మాయిని శిక్షించడమేమిట్రా? మగాడివి... విడాకులిచ్చి నువ్వు మళ్ళీ పెళ్లి చేసుకోగలుగుతావు... ఆడపిల్ల... ఆమె మళ్ళీ పెళ్ళి చేసుకోవటం ఎంత కష్టమో ఊహించావా?''

''చేసుకోకపోతే గంగలో కలవమను. అంతేగాని... ఈ కంఠంలో ప్రాణముండగా దాని ముఖం చూడను... దాంతో కాపురం చేయను''

''అంత భీష్మ ప్రతిజ్ఞ చేయకురా... నాకు భయమేస్తోంది''

''షటప్... నీకెందుకురా భయం?''

''ఓ అమాయకురాలి జీవితం నాశనమైపోతోందని''

''నా జీవితం గురించి ఎవరూ ఆలోచించరేంరా!'' రామకృష్ణ విసుక్కున్నాడు.

''నా అనుమానమేమిటంటే... నీ కోసం మీ అన్నయ్యో, నాన్నో ఎవరో ఒకరు వస్తారని'' ప్రసాద్ మాట విని రామకృష్ణ జడుసుకున్నాడు. ఒకసారి తలుపూ కిటికీలూ అన్నీ చూసి తేరుకున్నాడు.

''ఇంపాజిబుల్... నా ఫ్రెండ్స్‌లో ఈ ఇల్లెవరికి తెలియదు... అసలు నా ఫ్రెండ్స్ సర్కిల్‌లో నువ్వొకడవన్నట్లుగా కూడా ఎవరికీ తెలియదు''

''ఎందుకు తెలియదూ! మొన్ననే నీ క్రికెట్ టీమ్ ఫ్రెండొకడు నాకు పరిచయమయ్యాడు.

''ఎవడ్రా వాడు?''

''సత్యం...''

''వాడా? వాడు నీకెలా పరిచయమయ్యాడు?''

''వాళ్ళ బావకు బొలారంలో ఇల్లు అద్దెకు కావాలట. ఆ ఇంటికోసం తిరుగుతూ మా రూంకి వచ్చాడు. ఎక్కడో చూసినట్లనిపించి మాటా మాటా కలుపుకున్నాం. తను ఆర్ట్స్ కాలేజీ స్టూడెంటని తెలిసి 'రామకృష్ణ తెలుసా' అని అడిగాను. 'మా క్రికెట్ టీం కెప్టెనని' చెప్పి 'రామకృష్ణ' నీకెలా తెలుసునని నన్నడిగాడు. నేను మన పరిచయాన్ని చెప్పి మన ఫ్రెండ్‌షిప్‌ను గూర్చికూడా చెప్పాను''

''చెప్పావా?... ఏడ్చినావుగానీ... నేనప్పుడప్పుడు ఇక్కడికి వస్తున్నట్లుగా కూడా చెప్పావా?''

''ఆ.... అసలా సంగతి చెప్పకుంటే మన ఫ్రెండ్‌షిప్ ఎంత గొప్పదో ఎలా తెలుస్తుందిరా?''

''నీ గొప్ప పాడుగానూ... అయినా ఏం ఫరవాలేదులే. ఆ సత్యంగాడు కూడా నాకు ఈ మధ్యనే ఫ్రెండయ్యాడు. సత్యం ఇల్లు కూడా మా ఫ్రెండ్స్‌కు తెలియదనుకుంటాను. రామకృష్ణ గట్టిగా చెపుతున్నా... అతని మాటల్లో కొంచెం అనుమానం వినిపించింది.

''ఈ పాటికి మీ ఇంట్లో ఎంత భీభత్సం జరుగుతుందోరా పాపం... నాకా దృశ్యం ఊహించుకోవడానికే భయమేస్తోందిరా''

''జరగనీ... వాళ్లకలాగే జరగాలి... అందరూ ఏడ్చి మొత్తుకుని, గింజుకుని చచ్చిపోవాలి. అప్పుడుగాని నా కసి తీరదు... ఒరేయ్ టైమెంతయింది?''

''పదిన్నరయింది''

''ఇక మనం లైటార్పి పడుకుందాం... ఉండు ఒకసారి కిటికీలు అవీ పెట్టి ఉన్నాయో లేదో చూసొస్తాను'' రామకృష్ణ లేచి తలుపూ కిటికీలు అన్నీ చూసి బయటి జనసంచారం తగ్గిందో లేదో చూద్దామని ఒక కిటికీ తెరిచాడు.

రోడ్డుమీద ఒక ఆటో ఉంది. ఇద్దరు మనుషులు దానివద్ద నిలబడి డోర్‌కు వేసిన తాళాన్ని చూస్తున్నారు. రామకృష్ణ కిటికీ తలుపు తెరవగానే... ''అదుగో లోపల ఉన్నారు'' అన్న మాటలు వినిపించింది. ఆ గొంతు రామకృష్ణకు బాగా పరిచయం. అది వాళ్లన్నయ్య గోపీకృష్ణది.

రామకృష్ణ గభాలున కిటికీ తలుపు మూశాడు. అతనికి ముచ్చెమటలు పోస్తున్నాయి.

''ఒరేయ్ రామకృష్ణా! తలుపు తీయి... ఓయ్ ప్రసాదూ! తలుపు తీయవయ్యా!'' తలుపుమీద దబదబా బాదుతున్న శబ్దం రామకృష్ణకు గుండెలమీద పడుతున్నట్లనిపించింది.

''ఒరేయ్ రాముడూ! తలుపుతీయురా! తీయకుంటే తలుపు పగులకొడతాను'' తలుపుమీద ధనాధనా బాదుతూ గోపీకృష్ణ బెదిరించాడు.

''ఒరేయ్! చుట్టుపక్కల వాళ్ళంతా లేస్తార్రా... బాగుండదు... ఇంటివాడు గొడవచేస్తాడు. నీ నిర్ణయం గట్టిగా చెప్పేసెయ్... భయమెందుకురా! మీ నాన్న లేడుకదా!'' ఈ మాటలంటూనే ప్రసాద్ వెనుకనుండి వెళ్ళి తాళం తీసి తలుపు తీశాడు.

గోపీకృష్ణా సత్యమూ దొంగలను పట్టుకునే వాళ్లలా జాగ్రత్తపడుతూ లోపలకు వచ్చి తలుపుమూశారు.

''నీకు బుద్ధిలేదురా గాడిదా... పెళ్ళిచేసుకున్నవాడివి... శోభనం అక్కర్లేదూ! బ్లడీ ఫూల్! నేనెక్కడెక్కడ తిరగాల్సి వచ్చిందిరా! నీ ఫ్రెండ్స్ రఘు, దామోదర్, జనార్ధన్... వాళ్లందరిళ్ళూ తిరిగాను... చివరకు గౌలీగూడలోని రమేశ్ ఈ సత్యం అడ్రసు చెపితే... పాపం ఈ సత్యం నాతో పాటు వచ్చి ఈ ఇల్లు చూపించాడు. బయట ఆటో వుంది.... నడువ్'' గోపీకృష్ణ ఒక్క బిగిన మాట్లాడి రామకృష్ణ చేయిపట్టుకున్నాడు.

''ఫ్రెండువయ్యుండి కూడా ఇంత ద్రోహం చేస్తావురా?'' రామకృష్ణ సత్యంకేసి కోపంగా చూస్తూ అన్నాడు.

''ఫ్రెండుని కాబట్టే నిన్ను వెదికి పట్టుకున్నానురా... పెళ్ళి చేసుకుంటాడట... శోభనం వద్దంటాడట... ఇదేమన్నా చిన్నపిల్లల ఆటటరా? నోర్మూసుకుని ఆటో ఎక్కు'' సత్యం మందలింపుగా అన్నాడు.

''ఇంపాజిబుల్... నేను ఇంటికి రాను... దాని ముఖం చూడను'' దృఢంగా అన్నాడు రామకృష్ణ.

''ఒరేయ్ రాముడూ! ఆ పిల్ల గొంతు కోస్తావురా?'' గోపీకృష్ణ.

''మీరంతా కలిసి నా గొంతు కోయలేదూ?''

''ఒరేయ్! నాన్న పేరూ ప్రతిష్ఠా... మన కుటుంబ గౌరవం... వీటిని కూడా ఆలోచించరా''

''వాటన్నింటికన్నా నా జీవితం నాకు ముఖ్యం''

''అలా అనకురా... నాన్న మండిపడుతున్నాడు. బంధువులవ్వుందు తల వంచుకున్నాడు. నువ్వు రాకపోతే అమ్మానాన్నలకేమన్నా కావచ్చు. నాన్న పట్టుదల నీకు తెలియదురా''

''నాకింకేం చెప్పకు... మీరంతా నాకు శత్రువులు. నన్ను నాశనం చేయడానికి చూస్తున్న రాబందులు. నేను రాను... మీరు వెళ్లండి'' రామకృష్ణ అన్నగారి చేయి విదిలించుకుని ఓ కుర్చీలో కూలబడ్డాడు.

''రాముడూ! నువ్వట్లా అనకురా! ఇంటికిరా! ఊరికే ఈ రాత్రికి ఆ గదిలో పడుకో - ఇంకేమీ చేయకు. బంధువులంతా వెళ్లిపోయిం తర్వాత మనం ఈ విషయం ఆలోచిద్దాం. నీ ఇష్టప్రకారమే నిర్ణయించుకొందాం. ముందు కుటుంబం పరువు కాపాడరా'' గోపీకృష్ణలో

ఇంధాకటి కాఠిన్యం లేదు. రామకృష్ణ మోకాళ్లమీద తలపెట్టుకుని వింటున్నాడు.

''ఒరేయ్... మీ అన్నయ్య చెప్పినట్లు చేయరా! మీ పరువూ నిలుస్తుంది... నీ కోర్కె తీరుతుంది'' సత్యం, ప్రసాద్ - ఇద్దరూ ఆ మాటల్ని బలపరిచారు.

రామకృష్ణ ఆలోచించాడు.... ''కరెక్ట్... తను లోపలకెళ్ళగానే ముసుగుతన్ని పడుకుంటాడు. ఆ అమ్మాయి కుమిలి కుమిలి ఏడ్చి నిద్రపోతుంది... మరునాడు విషయం తెలిసి అందరూ కుళ్ళి కుళ్లి చస్తారు. తనకు కావలసిందదే...'' రామకృష్ణ మారుమాటాడకుండా లేచి గబగబా నడిచి ఆటో ఎక్కాడు.

* * *

గదిలోకెళ్లగానే రామకృష్ణ ఉక్కిరిబిక్కిరైపోయాడు. అగరొత్తుల వాసన, మల్లెపూల తోరణాలు - హాయిగా, అద్భుతంగా వుంది. వాటిని పట్టించుకోకూడదనుకున్నాడు రామకృష్ణ.

గదిలో ఓ మూలకు ఏడుస్తూ కూర్చొని వుంటుందని ఊహించిన రామకృష్ణకు మంచంమీద పడుకుని పత్రిక చూస్తున్న శైలజను చూసి ఆశ్చర్యం కలిగింది. తనామెను అసలే చూడకూడదనుకున్నాడు. కాని తను లోపలకు రాగానే దిగ్గున లేచి నుంచున్న ఆమెను చూడక తప్పలేదు. ఇదివరకటంత అసహ్యంగా కనిపించడం లేదామె. అయినా తనకు శ్రీమతి కాదగిన లక్షణాలామెలో ఏమాత్రం లేవు. ఎటో చూస్తూ వెళ్ళి మంచంమీద కూర్చున్నాడు రామకృష్ణ.

''నువ్వంటే నాకిష్టం లేదు. నీతో నేను కాపురం చేయను. త్వరలోనే నీకు విడాకులిస్తాను. నువ్వు మరో పెళ్ళి చేసుకున్నా నాకభ్యంతరం లేదు'' అని చెబుదామనుకున్నాడు రామకృష్ణ. కాని గొంతు పెగలలేదు. కాస్త తేరుకున్నాక చెబుదామనుకున్నాడు.

ఆమె పాలగ్లాసు చేతిలో పట్టుకుని నెమ్మదిగా నడిచి వచ్చి రామకృష్ణ కందించింది.

''అక్కర్లేదు... దయచేసి నా దగ్గరకు రాకు'' ఇంకా ఏదో అనబోయి అంతటితో ఊర్కున్నాడు.

ఈ మాటకు ఆమె ఏడుస్తుందనుకున్నాడు. కానీ ఆమె ఏడ్వలేదు. ఆడవాళ్ళు ఊరికే ఏడుస్తారనుకున్న అతని నమ్మకాన్ని ఆమె వమ్ము చేసింది.

ఆశ్చర్యం కనిపించకుండా నిండా దుప్పటి కప్పుకుని పడుకున్నాడు రామకృష్ణ.

ఇప్పుడామె ఏం చేస్తుంది? ఒకవేళ ఆమె దగ్గరకు వస్తే తనేం చేయాలి? చీదరించుకోవాలి. అయినా ఆడపిల్ల తనంతట తాను దగ్గరకు వస్తుందా? అందులో ఫస్ట్‌నైట్... అస్సలు రాదు. భర్త ఎంతో చొరవ తీసుకుంటే తప్ప భార్య ఆ కార్యానికి ఒప్పుకోదు. రామకృష్ణ ఆలోచిస్తున్నాడు.

రెండు మూడు నిమిషాలు గడిచాయి.

ఆమె పక్కనే పడుకుందని రామకృష్ణ గ్రహించేలోపలే ఆమె రామకృష్ణను గట్టిగా కౌగిలించుకుని తనవైపు తిప్పుకోవడానికి ప్రయత్నిస్తోంది.

ఇదేమిటి? ఈమె ఇంత చొరవ తీసుకుంటోంది. ఈమె స్పర్శ తనకు హాయిగా ఉందేమిటి? ఇదివరకెన్నడూ పొందని అద్భుతమైన ఆనందం తన శరీరం పొందుతుందేమిటి? రక్తం అడుగున నిద్రిస్తున్న ఎన్నో కోరికలు మెల్లగా మేలుకుంటున్నాయేమిటి? రామకృష్ణ విపరీతంగా చలించిపోతున్నాడు.

ఆమె తన పెదవుల్ని రామకృష్ణ పెదాలకు కలిపింది. ఆమె పొడవైన జడ అతని ముఖాన్ని కప్పివేసింది. ఆమె తలలోని మల్లెలు అతనికి మత్తెక్కిస్తున్నాయి.

'ఆమె తనమీద ఏదో మత్తుమందు చల్లుతోంది. తనను లొంగదీయడానికి ప్రయత్నిస్తోంది. తనామెకు లొంగకూడదు. ఆమె కౌగిలిని విడిపించుకుని పక్కకు తిరగడానికి ప్రయత్నించాడు. కాని ఆమె తన బాహువుల్లో అతన్ని గట్టిగా బంధించి వేసింది. అతన్ని దగ్గరగా, ఇంకా దగ్గరగా లాక్కుంటోంది. అతని తలను తన బరువైన వక్షోజాలకు అదుముకుంది. అతని పెదవుల్ని తన పెదవుల్తో కలిపివేసింది.

అతని కదంతా ఒక మహత్తర అనుభవంగా వుంది... హాయిగా ఉంది... మత్తుగా ఉంది... గమ్మత్తుగా ఉంది... మధురంగా ఉంది.

* * *

''ఏరా నీ భార్యకెప్పుడు విడాకులిస్తున్నావు?'' వారం రోజుల తర్వాత ప్రసాద్ కలిసి అడిగాడు.

''నెవర్... ఇంపాజిబుల్... షిఈజ్ ది మోస్ట్ బ్యూటిఫుల్ ఉమన్ ఇన్ద వరల్డ్. ఆమె అందం నాకు తప్ప మరెవరికీ కనిపించదు. స్త్రీలో బయట కనిపించే అందాన్ని మాత్రమే చూసేవాడు అంధుడు'' రామకృష్ణ చెప్పుకుపోతున్నాడు.

''ఇదేమిరోయ్! వింతగా మాట్లాడుతున్నావు'' ప్రసాద్ ఆశ్చర్యపోయాడు.

''స్వయంగా అనుభవిస్తే కాని నీకు అర్థం కాదురా! ఐ ఫెల్ ఇన్ లవ్ విత్ మై వైఫ్... ఆమె లేకుండా నేను ఒక్క క్షణం కూడా బతకలేను'' అంటూ టైం చూసుకున్నాడు రామకృష్ణ.

ప్రసాద్ అయోమయంగా చూస్తూ ఉన్నాడు.

''అప్పుడే అయిదయిపోయిందే... ఈ రోజు త్వరగా వస్తానని చెప్పానురా... సారీ'' అంటూ హడావుడిగా వెళ్లిపోయాడు భార్య ప్రేమలో పడ్డ ఆ నవయువకుడు.

త్వరలో వాళ్ల కుటుంబంలోనూ, బంధువుల్లోనూ, మిత్రవర్గంలోనూ 'భార్యను క్షణం కూడా వదలని భర్తగా పేరు తెచ్చుకున్నాడు రామకృష్ణ. ★

(స్వాతి - 24-1-86)